క్లుప్తంగా

రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా కొత్తగూడెం వాసి


సైదులు

గరిడేపల్లి : కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ సెల్ కన్వీనర్‌గా రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాది, గరిడేపల్లి మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన డాక్టర్ ఈసారపు సైదులుగౌడ్ నియమితుల య్యారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను హైకోర్టు సీనియర్ న్యాయవాది వట్టికూటి అంజయ్యగౌడ్ తదితరులు అభినందించారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ కమిటీల ఎన్నిక

మునగాల : మండలంలోని ఆకుపాములలో మంగళవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ గ్రామ నూతన కమిటీలను ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకొట్ల నాగరాజు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య మాదిగను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ ఆకుపాముల గ్రామ అధ్యక్షుడిగా తాళ్లపాక వీరబాబు, ఉపాధ్యక్షుడిగా తాళ్లపాక అర్జున్, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపాక అంజి, కార్యదర్శిగా బల్లెంల దావీదు, కోశాధికారిగా తాళ్లపాక సిద్దును ఎన్నుకున్నారు. ఎంఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా తాళ్లపాక వినోద్, ఉపాధ్యక్షుడిగా మీసాల వినయ్, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపాక నాగేంద్రబాబు, కార్యదర్శిగా తాళ్లపాక వినయ్, కోశాధికారిగా తాళ్లపాక ఉదయ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగరాజు, కొత్తపల్లి ఆంజయ్య పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో సౌకర్యాల కల్పన


దొండపాడులో ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పరిశ్రమ అధికారులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సామాజిక బాధ్యతతో గ్రామంలో సౌకర్యాలు కల్పిస్తున్నామని జువారి సిమెంట్ పరిశ్రమ అధికారులు పద్మాసింగ్ పాటిల్, జీఎస్బీ రావు అన్నారు. చింతలపాలెం మండలంలోని దొండపాడు ఎస్సీ కాలనీలో పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను, సీసీ రోడ్లను మంగళవారం వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు కె.పాపారావు, కరణం ఉగేంద్రపిళ్లై, నాయకులు నరాల కొండారెడ్డి, గోపిరెడ్డి పుల్లారెడ్డి, కొండా వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ టౌన్– 1 ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించనున్నందున పట్టణంలోని సాయిబాబా థియేటర్ రోడ్డు, బృందావనం కాలనీ, ఎన్జీఓస్ కాలనీలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నడిగూడెం మండలంలో..

నడిగూడెం : నడిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని బృందావనపురం, వేణుగోపాలపురం, చాకిరాల, శ్రీరంగపురం, కరివిరాల సబ్‌స్టేషన్ పరిధిలో కేశవాపురం గ్రామాల్లో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నందున బుధవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సైదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పేదల బతుకులు మారేదెప్పుడో..


మాట్లాడుతున్న పోషణబోయిన హుస్సేన్

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారడం లేదని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ అన్నారు. మండలంలోని సీతారాంపురంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంగళవారం పేదలతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో నిరుపేదల కోసం చేపట్టిన 25 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు 8 ఏళ్లుగా పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఇళ్లపై దృష్టి పెట్టి పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, మండల కమిటీ సభ్యులు వీరస్వామి, లక్ష్మమ్మ, పేదలు ఎంకమ్మ, సైదమ్మ, రాజు, కొండలు, వెంకటయ్య, నాగయ్య, గోపి, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప మండల పూజ

నేరేడుచర్ల : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మండల మహాపూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం పడి పూజ మహోత్సవానికి ఏర్పాట్లు చేసి మాట్లాడారు. ఈ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నిర్మించారు.. ప్రారంభం మరిచారు

- మునగాలలో రూ. 1.55 కోట్లతో పీహెచ్‌సీ భవనం నిర్మాణం
- పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంభించడంలో జాప్యం


మునగాలలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీ నూతన భవనం

మునగాల : మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన ఇటీవల రూ.1.55 కోట్ల వ్యయంతో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మించారు. ఆ భవన నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రారంచడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. నూతన భవనం ఎదురుగా పురాతన భవనం ఉండడంతో ఈ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో పురాతన భవనంలో సివిల్ ఆసుపత్రిని నిర్వహించేవారు. కాలానుగుణంగా సివిల్ ఆసుపత్రి గ్రేడ్‌ను తగ్గించి పీహెచ్‌సీగా మార్చి ప్రభుత్వం పదేళ్ల క్రితం ఓ భవనం నిర్మించింది. కాగా ఈ భవనం అసౌకర్యంగా ఉండడంతో ప్రభుత్వం నూతన భవనం కోసం నిధులు మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తిచేశారు. అన్ని హంగులతో నిర్మాణమైన నూతన భవనాన్ని ప్రారంభించేందుకు మాత్రం అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సివిల్ ఆసుపత్రి పురాతన భవనం

పీహెచ్‌సీని నూతన భవనంలోకి మార్చాలి



నూతన భవనాన్ని త్వరితగతిన ప్రారంభించి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీని అక్కడికి మార్చాలి. భవనం ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం అలసత్వం వహిస్తుంది. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని నూతన భవనం ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలి.

– గంధం సైదులు, సామాజిక కార్యకర్త, మునగాల

పాత భవనం కూల్చాక ప్రారంభిస్తాం



మండల కేంద్రంలో అన్ని హంగులతో పీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కానీ ఈ భవనానికి ముందు పురాతన భవనం ఉన్నందున నూతన భవనం ప్రారంభించడం లేదు. పురాతన భవనాన్ని కూల్చివేయాలని జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు నివేదిక పంపాం. పురాతన భవనం తొలగించిన వెంటనే నూతన భవనాన్ని ప్రారంభిస్తాం.

– డా.కోటాచలం, జిల్లా వైద్యాధికారి, సూర్యాపేట

కుటుంబ సర్వేను వేగవంతం చేయాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష


బరాఖత్‌గూడెంలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల : సమగ్ర కుటుంబ సర్వేను సిబ్బంది వేగవంతం చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి శిరీష కోరారు. మంగళవారం మండలంలోని బరాఖత్‌గూడెం, కృష్ణానగర్ గ్రామాల్లో కుటుంబ సర్వేను ఆమె పరిశీలించి మాట్లాడారు. అనంతరం బరాఖత్‌గూడెంలో పీఏసీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. కొనుగోళ్లను వేగవంతం చేసి ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రపంచ మరుగదొడ్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఏపీఓ శైలజ, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, దేవరం శ్వేత, శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ దొంతిరెడ్డి సులోచన, నారగాని కృష్ణవేణి, ఎన్యుమరేటర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

మునగాల : రైతాంగం విత్తనాల ఎంపిక, కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి బుంగా రాజు కోరారు. మంగళవారం మునగాల మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. విత్తనాల డీలర్లు నాణ్యమైన విత్తనాలను మాత్రమే సరఫరా చేయాలని, రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని కోరారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహించబోయే సీపీఎం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు భూక్యాపాండునాయక్ కోరారు. ఈమేరకు మంగళవారం మఠంపల్లి మండలంలోని భీల్యానాయక్‌తండా గ్రామంలో ఆయన నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఆయన వెంట సీపీఎం మండల కార్యదర్శి మాళోతు బాలునాయక్, దారావత్ హరినాయక్ తదితరులు ఉన్నారు.

చిల్లంచర్ల హరికిషన్ మృతి బాధాకరం

- కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు


హరికిషన్ సంతాపసభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

మునగాల : మండల కేంద్రానికి చెందిన సీపీఐ మండల నాయకుడు చిల్లంచర్ల హరికిషన్ అకాల మృతి బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం మునగాలలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన హరికిషన్ సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న అమరజీవి చిల్లంచర్ల రఘునాథం కుటుంబంలో జన్మించిన హరికిషన్ బాల్యం నుంచి మరణించే వరకు పార్టీలో కొనసాగుతూ పార్టీ పురోభివృద్ధికి ఎంతగానో కృషిచేశాడన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. తొలుత హరికిషన్ చిత్రపటం వద్ద రాష్ట్ర, జిల్లా, మండల నాయకులతో కలిసి ఆయన నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరిశంకర్, మేడ్చల్ జిల్లా మాజీ కలెక్టర్ ముస్కుల వెంకటరెడ్డి, తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తెల సృజన, సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హేమంతరావు, కోదాడ మాజీ ఎమ్మెల్యే వి.చందర్‌రావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, మాజీ జెడ్పీటీసీ సుంకర అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు కందిబండ సత్యనారాయణ, హరికిషన్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని వినతి

చిలుకూరు : తమను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని చిలుకూరు మండలంలోని పలువురు సీనియర్ మేట్లు కోరారు. ఈమేరకు మంగళవారం మునగాలలో ఓ కార్యక్రమానికి హాజరైన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా ఉపాధి హామీ పథకంలో సీనియర్ మేట్లుగా తాము పని చేస్తున్నామని, పనికి తగిన వేతనం రావడం లేదని, తమను ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తా

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామారావు


నిర్మాణంలో ఉన్న గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామారావు

హుజూర్‌నగర్ : జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ వచ్చిన ఆయన పట్టణంలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. నిర్మాణంలో ఉన్న గ్రంథాలయాన్ని త్వరగా పూర్తి అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటానన్నారు. అనంతరం ఆయనను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లిఖార్జున్ శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గల్లా వెంకటేశ్వర్లు, అజీజ్‌పాషా, అమర్‌నాథ్‌రెడ్డి, నర్సింగ్ వెంకటేశ్వర్లు, చింతకాయల రాము, సైదా మేస్త్రీ, మన్సూర్‌అలీ, జక్కుల మల్లయ్య, యోహాన్, సైదా, వల్లపుదాస్ కృష్ణ, వీరబాబు, గోవిందరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ


విద్యార్థి సబ్జెక్ట్ నాలెడ్జ్ పరీక్షిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

మునగాల : మండలంలోని జగన్నాథపురంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం మండల విద్యాధికారి పిడతల వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల తెలుగు, ఇంగ్లిష్, గణిత సబ్జెక్టుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీఎల్ఎం మెటీరియల్ ఉపయోగించి బోధిస్తే విద్యార్థుల అభ్యాసన అభివృద్ధికి దోహదపడుతుందని సూచించారు. ఈ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు వక్కంతుల భరత్‌బాబు, ఉపాధ్యాయురాలు ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకుంటున్న ఎంఈఓ చత్రునాయక్

గరిడేపల్లి : ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం, రంగాపురం ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా విద్యార్థులకు గణితం సబ్జెక్ట్‌లోని సంఖ్యలు, ఆరోహణ, అవరోహణ పాఠం చాలా చక్కగా బోధించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మరమ్మతులను పూర్తి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, సత్రు, లక్ష్మయ్య, రాజశేఖర్, సీఆర్పీలు రామకృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

నడిగూడెం : మండలంలోని నారాయణపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం కోదాడ వ్యవసాయ సహాయ సంచాలకులు డి.యల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం రాసులను పరిశీలించి తేమ శాతం ఎలా కొలవాలో సిబ్బందికి వివరించి మాట్లాడారు. ధాన్యం 17 శాతం మ్యాచర్ వచ్చే వరకు ఆరబెట్టాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం మద్దతు ధర రూ. 2320తో పాటు బోనస్ 500 అందిస్తుందన్నారు. పొలాల్లో వరికొయ్యలను కాల్చవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఆర్ దేవ ప్రసాద్, ఏఈఓ రేణుక, ఉప్పయ్య, వరి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ మంజుల, రైతులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు పెట్టొద్దు

కోదాడరూరల్ : రైతులు వరి కొయ్యలకు, గడ్డికి నిప్పుపెట్టడం ద్వారా భూమి సారాన్ని కోల్పోతుందని మండల వ్యవసాయాధికారిణి పాలెం రజని అన్నారు. మంగళవారం మండలంలోని కూచిపూడితో పాటు పలు గ్రామాల్లో ఆమె పర్యటించి వరికొయ్యలకు నిప్పు పెడితే జరిగే నష్టంపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. సింగిల్ సూపర్ పాస్పేట్ చల్లి వరికొయ్యలను భూమిలోనే కలియదున్నడంతో సేంద్రియ ఎరువుగా మారి పంటకు మేలు చేస్తుందని తెలిపారు. నిప్పు పెట్టొద్దని సూచించారు.

ప్రజాసంఘాల నాయకుల అరెస్టుపై ఖండన

మఠంపల్లి : లగచర్ల గిరిజనులను పరామర్శించడానికి వెళ్లిన ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాళోతు బాలునాయక్ అన్నారు. మంగళవారం మఠంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫార్మా సిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ, లగచర్ల గిరిజనుల పరామర్శకు వెళ్లిన గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మానాయక్, శ్రీరాంనాయక్‌లతో పాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. అరెస్టు చేసిన నాయకులను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి


కోదాడ : ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


నేరేడుచర్ల : ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : దేశానికి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి మాట్లాడారు.కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా మండల నాయకులు సాముల శివారెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, జక్కుల వీరయ్య, గల్లా వెంకటేశ్వర్లు, పోతుల జ్ఞానయ్య, అజీజ్‌పాషా, అమర్‌నాథ్‌రెడ్డి, నర్సింగ్ వెంకటేశ్వర్లు, మన్సూర్ అలీ, జక్కుల మల్లయ్య, యోహాన్, సైదా, కృష్ణ, సత్యనారాయణ, వీరబాబు, గోవిందరావు, శ్రీనివాసరెడ్డి, సైదులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోదాడ : దేశ కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డులో గల ఆమె విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, పార్టీ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఏర్నేని బాబు, కందుల కోటేశ్వరరావు, బాల్‌రెడ్డి, గంధం యాదగిరి, షాబుద్దీన్, కొల్ల కోటిరెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, పెండెం వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి, మదారు, డేగ శ్రీధర్, బాగ్దాద్, బాజాన్, పాలూరి సత్యనారాయణ, సుందరి వెంకటేశ్వర్లు, బుడిగం నాని తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైలార్‌శెట్టి వెంకయ్య, ముసి శ్రీనివాస్, బొడ్డుపల్లి భిక్షం పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో దివంగత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతిని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యరగాని భిక్షం, యరగాని నర్సింహారావు, గడ్డం నాగయ్య, వెంకటేశ్వర్లు, గోపి, సైదులు, పాల్గొన్నారు.

మోతె : మండల కేంద్రంలో మంగళవారం భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు దోసపాటి చిరంజీవి, పార్టీ నాయకులు బొడ్డు నర్సయ్య, ఎస్కే ఫరీద్, బొడ్డు సోమయ్య, నాగిరెడ్డి, యల్లారెడ్డి, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : మండలంలోని గణపవరంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు జాబిశెట్టి ప్రసాద్, బండి చిన్నకోటయ్య, పాపిశెట్టి సత్యం, ఇర్ల లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు, కాసాని సత్యం, కొండా నరసింహారావు, పుల్లారావు, సత్యం, బుచ్చాలు, నాగేశ్వరరావు, మదార్, గాంధీ, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మునగాల : భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్నారు. ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం మునగాల మండల కేంద్రంలోని రచ్చబండ వద్ద గల ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, నాయకులు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కాసర్ల కోటేశ్వరరావు, ఎండీ.రషీద్, చింతకాయల ఉపేందర్, ఎలక నరేందర్‌రెడ్డి, చింతకాయల నాగరాజు, శెట్టి గిరి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, కె.సత్యనారాయణరెడ్డి, సొంపంగు గోపి, మండవ శ్రీనివాస్, అక్కినేపల్లి రవి పాల్గొన్నారు.


మునగాలలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నేరేడుచర్ల : నేరేడుచర్లలో దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, జిల్లా నాయకులు పాల్వాయి కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ భూక్య గోపాల్, డైరెక్టర్లు మచ్చ శ్రీనివాస్, దేవులపల్లి శంకరాచారి, కౌన్సిలర్లు రణపంగ నాగయ్య, బాషా, నాయకులు పాండునాయక్, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వల్లంశెట్ల రమేష్‌బాబు, ఆకారపు వెంకటేశ్వర్లు, జంగిలి వెంకటేశ్వర్లు, ఖాదర్, శ్రీరాములు, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, సైదులు ఉన్నారు.

పాలకవీడు : మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి నరసింహారావు, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు భూక్యా గోపాల్, మాళోతు మోతీలాల్, నీమానాయక్, బండావత్ శ్రీను, సైదానాయక్, భాస్కర్‌రెడ్డి, శేషురెడ్డి, శ్రీకాంత్, నాగయ్య, సుబ్బు, కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌రూరల్ : బూరుగడ్డలో పూలమాల వేస్తున్న అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, తదితరులు


చిలుకూరు : ఆచార్యులగూడెంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


పాలకవీడులో..


కోదాడరూరల్ : గణపవరంలో..


మోతెలో..

ఆత్మగౌరవం కోసం మాలలు ఉద్యమించాలి

గరిడేపల్లి : మాలలు మౌనం వీడి తమ ఆత్మగౌరవం కోసం ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ దగ్గుపాటి బాబురావు అన్నారు. మంగళవారం మండలంలోని వెలిదండ గ్రామంలో మాల కులస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలల నూతన కమిటీల కోసం వారిని చైతన్య పరుస్తున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు వారి స్వార్థం కోసం ఎస్సీలను ముక్కలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ గొట్టెముక్కుల రాములు, మాడుగు దశరథ, అశోక్, రాజు, ప్రవీణ్, రాజా, వినోద్, రాము, అరుణ్, అంతోని కోటేశ్వరరావు, రాంబాబు, పెంటయ్య, కిరణ్, రాములు, శ్రీను, రవి, నర్సయ్య, జానయ్య, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మాలధారణతో మానసిక ప్రశాంతత


కోదాడరూరల్ : పూజలు చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌కే మూర్తి

కోదాడరూరల్ : మాలధారణతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌కే మూర్తి అన్నారు. మంగళవారం పట్టణంలోని గాలి రమేష్ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. నిర్వాహకులు శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు ఉన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో..

చిలుకూరు : మండల కేంద్రంలో అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. పూజారి రజనీకాంత్ ఆచార్య ఆలయ చైర్మన్ కొడారు వెంకటేశ్వర్లు, సభ్యులు, దాతలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప ఆలయం ఆవరణలో గల అన్నదాన వితరణ కేంద్రంలో అయ్యప్ప మాలధారులకు అన్నదానం కొనసాగుతోంది. దాతల సహకారంతో 155 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీను గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు తంగెళ్ల సాంబస్వామి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.